## దటీజ్ తెలంగాణ

దేశంలో వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్తు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. దీని కోసం ఏటా రూ. 5 వేల కోట్లు భరిస్తున్నది. 2014లో రాష్ట్రంలో 68 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా.. కేసీఆర్ సర్కారు ఫ్రీ కరెంటు నిర్ణయం, ప్రాజెక్టుల నిర్మాణంతో ఇప్పుడు ధాన్యం ఉత్పత్తి 2.6 కోట్ల టన్నులకు చేరింది.



సంక్షేమం

పోడు భూములకు సంబంధించిన పట్టాల కోసం గిరిపుత్రుల ఏండ్ల ఎదురుచూపులకు కేసీఆర్ సర్కారు పరిష్కారం చూపింది. 28 జిల్లాల్లో ఉన్న 4,06,369 ఎకరాలకు సంబంధించి 1,51,146 మంది లబ్ధిదారులకు పోడు పట్టాలను పంపిణీ చేసింది. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వలేదు.

పోడు భూములకు పట్టాలు

ప్రారంభం **2023**

పంపిణీ ఎకరాల్లో **4,05,601**

లబ్ధిదారులు **1,50,012**

# సాగర్ మెరిసే.. మనసు మురిసే..



- ఆహ్లాదానికి కేరాఫ్ ట్యాంక్ బండ్ పరిసరాలు
- హుస్సేన్ సాగర్‌కు సరికొత్త సొబగులు
- ఏటా పెరుగుతున్న పర్యాటకులు
- బీఆర్ఎస్ హయాంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి

*హుస్సేన్‌సాగర్ కేవలం చారిత్రక జలాశయం మాత్రమే కాదు.. ఆధునిక పర్యాటక కేంద్రంగా బీఆర్ఎస్ సర్కార్ అద్భుతమైన డిజైన్లతో తీర్చిదిద్దుతున్నది. రాజమందిరంలాంటి రాష్ట్ర సచివాలయం, 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్మారక చిహ్నం, సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన లేక్‌వ్యూ పార్కుతో ఆ ప్రాంతమంతా సరికొత్త శోభను సంతరించుకున్నది. సాగర తీరాన్ని సందర్శించే పర్యాటకులు సరికొత్త అనుభూతికి లోనవుతున్నారు.*

చారిత్రక నగరానికి తిలకం పెట్టినట్లుగా ఉండే హుస్సేన్‌సాగర్ ఇప్పుడొక పర్యాటక కేంద్రంగా మారుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో అడ్డగోలు కబ్జాలు, కంపు కొట్టే దుర్గంధం ఖైరతాబాద్ సిగ్నల్ వరకు వ్యాపించేది. కానీ బీఆర్ఎస్ సర్కార్ దశల వారీ అమలు చేస్తున్న ప్రణాళికాబద్ధమైన అభివృద్ధితో హుస్సేన్‌సాగర్ రూపురేఖలు మారిపోయాయి. గడిచిన మూడేండ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్లను వెచ్చించి చారిత్రక వైభవాన్ని మరింత పెంచుతున్నది. ఓ వైపు పాలరాతి కట్టడాన్ని తలపించే నూతన సచివాలయ భవనం, ఎదురుగా అమరుల స్మారక చిహ్నం, ఆ పక్కనే దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహంతో ట్యాంక్ బండ్ పరిసరాలు అమాంతం మారిపోయాయి. తాజాగా ఏర్పాటు చేసిన లేక్‌వ్యూ పార్క్ హుస్సేన్‌సాగర్ వైపు పర్యాటకులను మరింత ఆకర్షిస్తున్నది.

జలాశయం చుట్టూ హైదరాబాద్ మహానగరం సరికొత్త సొబగులతో ముస్తాబవుతున్నది. సచివాలయం ఎదుట నిర్మించిన మ్యూజికల్ ఫౌంటెన్ నగర వాసులతో పాటు ఇతర ప్రాంతాలు, విదేశీ పర్యాటకులకు ఆహ్లాదాన్నిస్తున్నది.



హుస్సేన్ సాగర్ తీరాన తిరంగా రెపరెపలు

### పర్యాటక కేంద్రంగా పాలన వేదిక..

తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో నూతన సచివాలయం కీలకంగా మారింది. అలాంటి సచివాలయం పరిపాలనకు కేంద్ర బిందువుగా మారుతున్నది. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా హుస్సేన్‌సాగర్‌ను ఆట విడుపు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. వీకెండ్ వచ్చిందంటే చుట్టూ ఉన్న వివిధ పార్కులను లక్షలాది మంది సందర్శిస్తున్నారు.

### భారీ కట్టడాలతో మారిన స్వరూపం..

హుస్సేన్‌సాగర్ చుట్టూ హెచ్ఎండీఏ ఇప్పటికే సుందరీకరణ పనులను పూర్తి చేసింది. చారిత్రాత్మక నేపథ్యం కనిపించేలా ట్యాంక్‌బండ్‌పై పలు భారీ కట్టడాలు చేపట్టారు. లుంబినీ పార్కు, ఎన్టీఆర్ గార్డెన్‌లను కలుపుతూ ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు పనులు చేపట్టారు. ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ట్‌లతో డిజైన్లు రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నారు. తెలంగాణ అమరుల త్యాగానికి ప్రతీకగా నిలిచేలా స్మారక స్థూపాన్ని అత్యంత ఆకర్షణీయంగా నిర్మించారు. ఇప్పటికే ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్కు, పీ.వీ.నరసింహారావు మార్గం (నెక్లెస్ రోడ్), సంజీవయ్య పార్కు, జలవిహార్, పీవీ ఘాట్, థ్రిల్ సిటీతో ఆ ప్రాంతం రూపురేఖలే మారిపోయాయి.

### సాగర తీరంలో సరికొత్త అనుభూతి..

సాగర తీరంలో నిర్మించిన లేక్‌వ్యూ పార్కు ఆ ప్రాంతానికి మరింత వన్నె తీసుకువచ్చింది. లేక్ అందాలన్నీ కనబడే విధంగా లొకేషన్ తీరం, సాగర్ ఒడ్డున కూర్చుని సేద తీరేలా అబ్బురపరిచే ప్రవేశ ద్వారం, పాత్‌వేలు, పిల్లల కోసం ప్లే గ్రౌండ్, అందాలన్నీ ఆస్వాదించేలా అండర్‌పాస్, వాటర్ థీమ్ పార్కు, సాగర్ అలలపై నిలుచున్నట్లు గ్లాసు డెక్, ఫ్లోర్ స్కేప్, ఎలివేటెడ్ వాక్‌వే విత్ అండర్ పాసెస్, పెడస్ట్రియన్ ట్రయల్స్, మూడు మీటర్ల వెడల్పుతో వేవ్ వాక్, ఇన్నోవేటివ్ చిల్డ్రన్ ప్లే ఏరియా ఇలా ఎన్నో ప్రత్యేకతలతో పర్యాటకులకు కనువిందు చేస్తున్నది..



అంబేద్కర్ విగ్రహం

... కడార్ల కిరణ్

## షాట్-బై-షాట్



# చెప్పిందే కాదు.. చెప్పనిదీ చేస్తాడు

*'ఆంధ్రప్రదేశ్ నుంచి ఢిల్లీ వెళ్తున్నాను. మళ్లీ నేను అడుగుపెట్టేది తెలంగాణ గడ్డ మీదనే'*
*'హరిహర బ్రహ్మాదులు అడ్డం వచ్చినా, నాలుగేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి తీరుతా. తెలంగాణలో కోటి ఎకరాలకు నీళ్లు పారిస్తా'*
*'ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులతో ఎన్నోసార్లు వాదించాను. గోదావరి నీళ్లు ఊరికనే పోతున్నయి. మాకు ఇస్తే ఏం పాయె అని. వాళ్లు ఇయ్యలే. మేం ఇయ్యాల తెచ్చి చూపించినం'*

'మనిషి ఎప్పుడూ పుట్టిన తర్వాతనే నేర్చుకుంటడు తప్ప, పుట్టకముందే అన్నీ నేర్చుకొని మనం ఎవ్వరం భూమ్మీదకు రాం. టైం మనకోసం ఆగదు. ఆ ఉండిన టైమ్‌ను ఎవరు ఎంత గొప్పగా వాడుకున్నాం.. దాన్ని ఎంత బాగా ఆస్వాదించినం.. మనం పెట్టుకున్న లక్ష్యాలు ఏమైనా ఉన్నయా.. ఆ లక్ష్యం దిశగా మనం అడుగులు వేస్తున్నామా లేదా.. ఇవన్నీ ఆలోచించుకోవాలి. సమస్య నుంచి పారిపోవద్దు. వి షుడ్ రన్ ఇన్ టు ద ప్రాబ్లం'

**ఇవన్నీ మన ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన మాటలు. ఆయన చెప్పే మాటలు.. చేసే పనులు ఏవైనా ఆ స్థాయిలోనే ఉంటయి. ఇచ్చిన హామీలు అమలు చేయడం మాత్రమే కాదు.. ఇవ్వని హామీలనూ ఆచరణలోకి తీసుకొస్తారు కేసీఆర్.**

**అసలు విషయానికొస్తే...**

**రాహుల్‌గాంధీ:** కేసీఆర్‌ది కుటుంబ పాలన. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్లు దోచుకున్నాడు. (మోతీలాల్, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిర, రాజీవ్, సోనియా, రాహుల్, ప్రియాంక.. వీళ్లంతా ఎవరు? ఇంక ఈయనే చెప్పాలి.. కుటుంబపాలన గురించి. అయినా 80 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎట్లా సాధ్యమో రాహుల్‌కే తెలియాలి. లెక్కల్లో మరీ ఇంత పూర్ అనుకోలేదు!)

**రేవంత్‌రెడ్డి:** సోనియమ్మ తెలంగాణ ఇవ్వకుంటే మీరు నాంపల్లి దర్గా దగ్గర అడుక్కు తినేటోళ్లు! (భారీ ముడుపులు ఇచ్చి కొనుక్కున్న ఆ పీసీసీ అధ్యక్ష పదవే లేకపోతే ఈయన పరిస్థితి కచ్చితంగా అదే అయ్యుండేది!)

**కిషన్‌రెడ్డి:** ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన వ్యక్తి కేసీఆర్. (కేసీఆర్ హామీల జాబితా, గత పదేండ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాల లిస్టు ముందేసుకొని, 'కుర్‌కురే' తింటూ ఒక్క లుక్కేయండి. ప్రధాని మోదీ హామీల లిస్టుపై కూడా ఓ లుక్కేయండి. మోసం ఎవరిదో మీకే తెలుస్తుంది.)

**ఈటెల రాజేందర్:** బీఆర్ఎస్ కండువాలు కప్పుకుంటేనే పథకాలు ఇస్తారా. పథకాలను ఆపేందుకు మీరెవర్రా? (మంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ గురించి మీరు మాట్లాడిన మాటలు ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. ఇప్పటి మీ భాష చూడండి. అదే మీ స్థాయి.)

ఇవన్నీ 'తెలంగాణలో రాబోయేది మా ప్రభుత్వమే' అని గాల్లో మేడలు కడుతున్న సోకాల్డ్ కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు. వారి మాటలకు, కేసీఆర్ చేతలకు జమీన్ ఆస్మాన్ ఫరక్ ఉంటుంది. తెలంగాణ అభివృద్ధి-సంక్షేమం కేసీఆర్ మాటల్లో ప్రస్ఫుటిస్తాయి. మాటల్లో చెప్పింది కేసీఆర్ చేసి చూపిస్తారు. మరోవైపు ప్రతిపక్ష నేతల ప్రసంగాల్లో ఎంతసేపూ 'కేసీఆర్‌ను దించుతాం.. కేసీఆర్‌ది అవినీతి పాలన.. కుటుంబ పాలన' వంటి రొటీన్ డైలాగులే ఉంటాయి తప్ప.. 'తెలంగాణను కేసీఆర్ కంటే గొప్పగా తీర్చిదిద్దుతాం.. ఇదిగో ఇది చేస్తాం' అని వారు చెప్పలేకపోతున్నారు. అంత అవగాహన వారికి లేదు. 'కేసీఆర్‌ను దించి ఆ పీఠం ఎక్కాలి' అన్న అధికార లాలస తప్ప మరొకటి వారికి తెలీదు.

***మరి మీ ఓటెవరికి? అధికార లాలసకా... అభివృద్ధి-సంక్షేమ పిపాసికా?***

... మనోహర్ చిమ్మని

## మనమే నెంబర్ 1



# 60% పెరిగిన సాగు విస్తీర్ణం

### పెరిగిన నీటి లభ్యత ...సాగులోకొచ్చిన లక్షల ఎకరాలు

తెలంగాణ ప్రాంత రైతులకు సాగు సవాళ్లతో కూడుకొన్న వ్యవహారం. వానకాలంలో వర్షాలు పడితేనే పంటలు సాగయ్యేవి. యాసంగిలో భూములన్నీ బీడుగానే ఉండేవి. సాగునీటి వసతి లేకపోవడంతో తెలంగాణ కరువుకు చిరునామాగా ఉండేది. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ సాగునీటి గోస తీర్చడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు సాయంతో బీడుభూములకు జలకళ తెచ్చారు. దీంతో 2014-15లో యాసంగి, వానకాలం కలిపి 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2022-23లో 2.09 కోట్ల ఎకరాలకు పెరిగింది. అదనంగా ఏటా 15-20 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి.

**తొమ్మిదేండ్లలో సాగు విస్తీర్ణంలో మార్పు ఇది**

2014
**1.31** కోట్ల ఎకరాలు

2023
**2.09** కోట్ల ఎకరాలు


పెరుగుదల
**60** శాతం

### విశేషం

*75 ఏండ్ల స్వతంత్ర భారతంలో దేశవ్యాప్తంగా పెరిగిన సాగు విస్తీర్ణం 6.7% కాగా, కేసీఆర్ పాలనలో తెలంగాణలో పెరిగిన సాగు విస్తీర్ణం 60%. కేసీఆర్ ప్రభుత్వంలాగ సాగుపై కేంద్రప్రభుత్వం దృష్టి సారించినట్లైతే, వచ్చే ఇరవై ఏండ్లకు సరిపడా ధాన్యరాశులను ఒక్క ఏడాదిలోనే పండించే స్థాయికి భారత్ చేరుకునేది.*

### వానకాలం, యాసంగి సాగు విస్తీర్ణంలో మార్పు ఇలా..

సంవత్సరం .. సాగు విస్తీర్ణం(కోట్ల ఎకరాలు)



| సంవత్సరం | సాగు విస్తీర్ణం (కోట్ల ఎకరాలు) |
| --- | --- |
| 2014-15 | 1.31 |
| 2015-16 | 1.21 |
| 2016-17 | 1.48 |
| 2017-18 | 1.50 |
| 2018-19 | 1.43 |
| 2019-20 | 1.88 |
| 2020-21 | 2.04 |
| 2021-22 | 1.95 |
| 2022-23 | 2.09 |

*బాన్సువాడ నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటయ్యింది. ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గంలో గట్టి పట్టున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో ఆయనకు ఎదురులేకుండా పోయింది. 2011 నుంచి బాన్సువాడ సెగ్మెంట్‌లో గులాబీ జెండా ఎగురుతున్నది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తనకున్న సాన్నిహిత్యం వల్ల శ్రీనివాసరెడ్డి భారీగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారు.*




# చదువుల మేడ.. బాన్సువాడ

- విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట
- రూ.10వేల కోట్లతో అభివృద్ధి పనులు
- పోచారానికి జై కొడుతున్న ప్రజలు

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడ 11 వేలకు పైగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేయించి నంబర్ వన్ స్థానంలో నిలిపారు. కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరోమారు శ్రీనివాస్‌రెడ్డిని విజయతీరాలకు చేర్చనున్నాయి.

### రూ.10 వేల కోట్లతో అభివృద్ధి...

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొమ్మిదేండ్లలో రూ.10 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియా ప్రాంతాలకు సాగునీరు ఇవ్వాలన్న లక్ష్యంతో సిద్ధాపూర్‌లో రూ.200 కోట్ల వ్యయంతో మూడు చెరువులను కలిపి రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.300 కోట్లతో చందూర్, జాకోరా ఎత్తిపోతలను మంజూరు చేసింది. రూ.7 కోట్లతో కల్కి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చింది. ఈ చెరువు తీరాన రూ.4 కోట్లతో ఆక్సిజన్ పార్కు, చిల్డ్రన్స్ పార్కును నిర్మించింది.

### ఎడ్యుకేషన్ హబ్

బాన్సువాడ ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల ఏర్పాటయ్యింది. ఎమ్మెల్యే పోచారం చొరవతో నర్సింగ్ కాలేజీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ, వృత్తి విద్యా కోర్సు కళాశాలలు, మహిళా కళాశాల, పోస్టు మెట్రిక్ వసతి గృహాలు అన్నీ కలిపి సుమారు 30 కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను మంజూరు చేయించారు. తాజాగా బాన్సువాడ పట్టణంలో రూ. 70 లక్షలతో ఉర్దూ మీడి యం జూనియర్ కళాశాల, రూ. 2.5కోట్లతో జూనియర్ కళాశాల భవనాలను నిర్మించారు. యువత కోసం రూ.2 కోట్లతో ప్రొఫెసర్ జయశంకర్ మినీస్టేడియాన్ని నిర్మించారు.

### కార్పొరేట్ స్థాయి వైద్యం

బాన్సువాడ దవాఖానలో వసతులు మెరుగుపరిచారు. దాదాపు రూ.100 కోట్లతో ప్రభుత్వ దవాఖానలను ఆధునీకరించి పేదలకు ఉచితంగా కార్పొరేట్ తరహా వైద్య సేవలందిస్తున్నారు. దీంతో బాన్సువాడలోని ఏరియా దవాఖానకు మూడుసార్లు కాయకల్ప, నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ అవార్డు దక్కింది. రూ. 20కోట్ల నిధులతో మరో వంద పడకల మాతాశిశు దవాఖానను అందుబాటులోకి తెచ్చారు. దవాఖానకు బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ ఇనిషియేటివ్ అవార్డుతో గ్రేడ్-1 సాధించింది. కోటగిరి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని రూ.13 కోట్లతో 50 పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేయించారు. పొతంగల్ పీహెచ్‌సీ.. కాయకల్పతోపాటు మరో జాతీయ అవార్డుకు ఎంపికైంది.

**- బాన్సువాడ, నమస్తే తెలంగాణ**

# మీ మేలు ఎప్పటికీ గుర్తుంచుకుంట

*ట్రాఫిక్ డ్యూటీ అంటేనే రిస్క్. రోడ్డు మీద ఎండలో, వానలో పని చేయాలె. కూర్చునే అవకాశమే ఉండదు. ఎండకు బాడీ బాగా డీహైడ్రేషన్ అయితది. అట్లనే పొగ, దుమ్ము పీల్చాలె. పొల్యూషన్ తోని స్కిన్ ప్రాబ్లమ్స్, గుండె జబ్బులు, అస్తమా, టీబీ, షుగర్ వస్తయి. కంటి చూపు తొందరగా తగ్గుతది. నిలబడీ నిలబడీ మోకాళ్లు నొస్తయి. కొంతమంది రోడ్డు మీదనే బైక్‌లు, కార్లు పార్కింగ్ చేస్తరు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండ వాటిని జరపాలె. బైక్‌లను జరిపీ..జరిపీ బ్యాక్ పెయిన్, ఒళ్లు నొప్పులు వస్తయి. యాభై ఏళ్ల తర్వాత ఈ డ్యూటీ చానా కష్టంగా ఉంటుంది. హెల్త్ ప్రాబ్లమ్స్ తప్పకుండ వస్తయి. ట్రాఫిక్‌ని క్లియర్ చేయాలి. మోకాళ్లు నొచ్చినా, నీరసమొచ్చినా రెస్ట్ తీస్కోనీకి చాన్స్ ఉండదు. కాసేపు వదిలేస్తే ట్రాఫిక్ జామ్ అయిపోతది. ఒంట్ల హుషార్ లేకున్నా పని చేయాలె. పనిల కొంతమంది రివర్స్‌లో మాట్లాడతరు. అయినా మేం పబ్లిక్‌తో పొలైట్‌గా మాట్లాడాలె. మస్త్ టెన్షన్ ఉంటది. తొందరగ బీపీ జబ్బు వస్తది. ఇన్ని బాధలు పడుకుంట హెల్త్ ఖరాబ్ చేసుకుంటున్నం. మా కష్టాన్ని గుర్తించిన కేసీఆర్ సార్ శాలరీలో ముప్పై శాతం రిస్క్ అలవెన్స్ ప్రకటించి ఇస్తున్నడు. దేశంలో ఇట్ల ఏ రాష్ట్రంల ఇయ్యట్లే. ఒక్క తెలంగాణ గవర్నమెంటే మా కష్టాన్ని గుర్తించి, దానికి తగిన ప్రతిఫలం ఇస్తున్నది. ట్రాఫిక్ కానిస్టేబుల్ డ్యూటీ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలె. మంచి ఫుడ్ తింటే జబ్బులు రాకుండా కాపాడుకోవచ్చు. ఈ రిస్క్ అలవెన్స్ రాబట్టి మంచి ఫుడ్ తీసుకోగలుగుతున్న. మా కష్టాన్ని, ఆరోగ్య సమస్యల్ని తెలుసుకుని మేలు చేసిన కేసీఆర్ సార్‌ని ఎప్పటికీ గుర్తుంచుకుంట.*



***- రితేష్ సింగ్, ట్రాఫిక్ కానిస్టేబుల్, అసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, హైదరాబాద్***

## సోషల్ యాంగిల్



**నాడు**
నదుల పరుగు సముద్రం వైపు
రైతుల పరుగు వలసల వైపు
పేదల ఆకలి చావులు
రైతుల ఆత్మహత్యలు

**నేడు**
నదుల పరుగు బీడు భూముల వైపు
రైతుల పరుగు పచ్చని పొలాల వైపు
పేదల చేతికి నెలనెలా ఆసరా
పల్లె ముంగిట పాడిపంటల ముచ్చట

కేసీఆర్ పాలన అంటే
పసిపిల్లల కేరింతలు..
పంటకాలువల తుళ్లింతలు..
పశుపక్ష్యాదుల పదనిసలు..
ఊరిముంగిళ్లలో
ఆటపాటలు..
ఆలయాల్లో జేగంటలు..

**-నిరంజన్**